క్లుప్తంగా

వివేకానంద ఆదర్శనీయుడు



వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఆకివీడు: వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు భవిష్యత్‌కు బాట వేయాలని లయన్స్ ఆదర్శ క్లబ్ కార్యదర్శి మోరా జ్యోతిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ స్కూల్‌లోని వివేకానంద విగ్రహాన్ని పూలమాల వేసి, జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవాళి గర్వించ దగ్గ మనిషి వివేకానంద అని కొనియాడారు. ఆయన ఆశయాలను విద్యార్థులు పాటించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు బాబు, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

ఉండి: గోరింతోటలో వ్యక్తిపై జరిగిన దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి గోరింతటలోని చర్చ్ వద్ద ఈ నెల 31వ తేదీ రాత్రి చోటు చేసుకున్న వివాదంలో మునకాల రవిరాజు అనే వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన చింతాల జయశేఖర్ అనే వ్యక్తి దాడికి పాల్పడంతో రవిరాజు గాయపడ్డాడు. దీంతో అతడిని భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందించారు. ఆసుపత్రి నుంచి తమకు అందిన సమాచారం మేరకు, బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌లో ట్రోఫీని అందుకుంటున్న విజేతలు

భీమవరం: డీఎన్నార్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ రీయూనియన్ మ్యాచ్‌లు ఆదివారం ముగిశాయి. భీమవరం గ్రీన్స్, బ్లూస్ జట్లు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భీమవరం బ్లూస్ జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 155 పరుగులు చేసింది. ఈ జట్టులో సారిక త్రిమూర్తులు 39, పులగం శేషు 22 పరుగులు చేశారు. తరువాత బ్యాటింగ్ చేసిన భీమవరం గ్రీన్స్ జట్టు 22.5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 156 పరుగులు చేసి విజయం సాధించారు. ఈ జట్టులో సతీష్ 50, కృష్ణమోహన్ 50 (నాటౌట్) పరుగులు శర్మ 48 (నాటౌట్)గా నిలిచారు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ ప్రతిభ కనబర్చిన కృష్ణమోహన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పులపర్తి ప్రశాంత్ చేతుల మీదుగా విన్నర్స్ ట్రోఫీని గ్రీన్ జట్టు కెప్టెన్ మానేపల్లి సూర్య మాణిక్యం అందుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీనివాస్‌రాజు చేతుల మీదుగా రన్నర్స్ ట్రోఫీని బ్లూస్ కెప్టెన్ డీఎస్ రాజు అందుకున్నారు. కార్యక్రమంలో డీఎన్నార్ కళాశాల సెక్రటరీ శ్రీగాదిరాజు బాబు, కార్యవర్గ సభ్యులు బోసు రాజు, సీబ కాశీచరణ్, తదితరులు పాల్గొన్నారు. మొత్తం మూడు రోజుల పోటీల్లో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా కిషోర్ (ఏలూరు), బెస్ట్ ఫీల్డర్‌గా నూకల శ్రీనివాస్ (హైద్రాబాద్), బెస్ట్ బౌలర్‌గా రెహమాన్ (హైదరాబాద్), మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా శర్మ (ఏలూరు) ఎంపిక అయ్యారు.

ఆంధ్రులు గర్వించే కళ కూచిపూడి



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కొలనువాడ అమృతశ్రీ

ఆకివీడు: ఖండాంతరాల ఖ్యాతి పొందిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆంధ్రులు గర్వించదగ్గ కళ అని ప్రముఖ నాట్యాచార్యులు ముసునూరి శైలజారావు, సీహెచ్ శ్రీనివాస్, చింతా రవి బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక శాంతి ఫంక్షన్ హాలులో ఆదివారం నాట్యాచారిణి కొలనువాడ అమృతశ్రీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య రంగ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకల మానవాళి సమానత్వాన్ని చాటుతూ తెలుగు జాతి గర్వంగా చెప్పుకునే విధంగా కృష్ణా జిల్లా కూచిపూడిలో పుట్టిన నృత్య ప్రదర్శన నేడు ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందుతుందన్నారు. కార్యక్రమంలో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత కురవి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు, చుండూరి వెంకట్రావు, కొలనువాడ సత్యనారాయణరాజు, వేగేశ్న గోపాలకృష్ణంరాజు, జీవీ సత్యనారాయణరాజు, మోటుపల్లి గంగాధరరావు, గొట్టుముక్కల బాబ్జీరాజు, కలిదిండి ఇంద్రరాజు, మహేష్ వర్మ పాల్గొన్నారు.

కోడి గుడ్డు ధరకు రెక్కలు

- దుకాణాల్లో గుడ్డు రూ.8, మాల్స్‌లో రూ.10
- 30 గుడ్ల ధర రూ.145 నుంచి రూ.210కి పెరిగింది



వీరవాసరం: కోడి గుడ్డు ధరకు రెక్కలు వచ్చాయి. ధర రోజురోజుకూ ఎగబాకుతోంది. కార్తీక మాసం తర్వాత చికెన్, మటన్ ధరలు పెరగాల్సి ఉంది. వాటి ధరలు స్వల్పంగా పెరగగా గుడ్డు ధర మాత్రం అమాంతం పెరిగిపోతుంది. కోవిడ్ సమయంలో కూడా లేనంత ధర ఇప్పుడు ఉంది. ఒక గుడ్డు దుకాణాల్లో రూ.8, మాల్స్‌లో రూ.10 వరకూ పలకడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. అమ్మో.. గుడ్డు ధర ఇంతా అంటూ ఆశ్చర్యపోతున్నారు. గతంలో కోడి గుడ్డు ధర రూ.5 నుంచి రూ.6 మధ్య ఉండేది. వారం కిందట రూ.6.30 నుంచి రూ.7 వరకు ఉండేది. ప్రస్తుతం 8 రూపాయలకు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్‌లో 30 గుడ్ల ట్రే ధర రూ.210 నడుస్తుతోంది. ఈ లెక్కన ఒక్కో గుడ్డు రూ.7 పడుతుంది. ఇక సూపర్ మార్కెట్లలో గుడ్డు రూ.10కి అమ్ముతున్నారు. చికెన్ ధర మాత్రం గతంలో కిలో రూ.180 నుంచి 210 మధ్య ఉండగా ఇప్పుడు కూడా అదే రేటులో ఉంది. మటన్ ధర గతంలో రూ.800 నుంచి రూ.1000 వరకు ఉండగా ప్రస్తుతం అదే ధర కొనసాగుతోంది. కోడి గుడ్డు ధర ఇంతలా పెరగడంతో వినియోగదారులు షాక్ తింటున్నారు.

రోజూ రూ.2 లక్షల పైమాటే..

మండలంలో రోజువారీ కోడి గుడ్ల వాడకం రూ.2 లక్షల పైమాటే. గుడ్డు ఆరోగ్యకరమని చెబుతున్న వైద్యుల సలహాల మేరకు వినియోగదారులు పెరిగిపోతున్నారు. మండలంలో ప్రజలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా గుడ్ల వినియోగం అధికంగా ఉంటుంది. దీనికి తోడు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లలో అధికంగా వాడుతున్నారు.

గుడ్ల ధర పెరుగుదల ఇలా..

ఆగస్టులో రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు రూ.5.50 ఉండగా ఇప్పుడు రూ.8కి పెరిగిపోయింది. 20 రోజుల కింద 30 గుడ్ల ట్రే హోల్‌సేల్‌లో రూ.145 ఉండగా నేడు రూ.210 చేరింది.

వ్యాయామాలు చేసే వారికి గుడ్డు పడాల్సిందే

గుడ్డు పౌష్టికాహారం కావడంతో జిమ్‌కి వెళ్లేవారు అధికంగా వాడతారు. పార్కులు, జిమ్‌ల ఆవరణలో ప్రత్యేకంగా ఉడకబెట్టిన గుడ్లు, రాగి సంకటి స్టాల్స్ వెలిశాయి. దీంతో గుడ్ల వినియోగం పెరిగింది. మరో పండగలు వస్తుండడంతో బేకరీ, ఫుడ్స్, కేక్‌ల తయారీల్లో గుడ్లు వినియోగించడంతో ఎన్నడూ లేని విధంగా ధరలు పెరిగాయని నిపుణులు చెబుతున్నారు.

పెరిగిన ధరలతో సెగలు

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు వంటింట్లో సెగలు పుట్టిస్తున్నాయి. కూరగాయల రేట్లతో పాటు ఉప్పు నుంచి పప్పు వరకూ ప్రతి వస్తువు ధర పెరిగింది. దీనికి తోడు అందరికీ అందుబాటులో ఉండే గుడ్ల ధర కూడా పెరగడంతో ఏం కొనేటట్టు లేదు, తినేటట్టు లేదని అవేదన చెందుతున్నారు. ధరలను నియంత్రించి పేద ప్రజలను ఆదుకోవాలని కోరుతున్నారు.

వంతెనకు మరమ్మతులు



ఎన్నార్పీ అగ్రహారంలో వంతెన మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో ఉండి కాలువపై ఉన్న వంతెనకు ఆదివారం మరమ్మత్తులు చేశారు. గత కొన్నేళ్ల నుంచి వంతెనపై రేకు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రధాన గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఆనుకుని వంతెన ఉండటంతో పలువురు విద్యార్థులు, గ్రామంలోని రైతులు గాయపడ్డారు. దీంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం పాతరేకుపై మధ్య భాగంలో కొత్తరేకు ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానిక విద్యార్థులతో పాటు, ఎస్సీ, బీసీ కాలనీలకు చెందిన విద్యార్థులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే వేసవిలో వంతెన మధ్య భాగంలో రేకు తొలగించి శ్లాబ్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సూరవరపు వెంకటాచార్యులు, ముగ్గళ్ల సత్యనారాయణ, చిలుకు చంటి, తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాన్ని బట్టే సంస్థల పురోభివృద్ధి



దుంపగడప డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో సావనీర్‌ను ప్రారంభించిన మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు

ఆకివీడు: సామర్థ్యాన్ని బట్టే సంస్థలు పురోభివృద్ధి సాధిస్తాయని మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు అన్నారు. మండలంలోని దుంపగడపలో వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బాపిరాజు మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో పని చేసే అధ్యాపకులు, ఉపాధ్యాయుల సామర్థ్యాలను, నైపుణ్యాన్ని బట్టి ఆయా సంస్థల్లో విద్యార్థులు అధికంగా చేరతారన్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపకపోవడానికి అదే కారణమన్నారు. దుంపగడప కళాశాలలో అన్ని వసతులూ కల్పించిన పూర్వ విద్యార్థి సంఘం, అభివృద్ధి కమిటీకి ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థులు అధికంగా కళాశాలలో చేరేందుకు అధ్యాపకులు శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. కళాశాలలో విద్యార్థులను చేర్పించేందుకు సహకరించాలనే విధానాన్ని మానుకుని, విద్యార్థులు చేరేందుకు రికమండేషన్ కోసం వెళ్లే స్థాయికి కళాశాలను తీసుకు రావాలని అధ్యాపక సిబ్బందికి సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత మాట్లాడుతూ కళాశాలలో అన్ని వసతులూ కల్పించామన్నారు. పూర్వ స్థితి నుంచి నేడు కళాశాల కార్పొరేట్ సౌకర్యాలతో విరాజిల్లుతోందన్నారు. విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే విధంగా తనతోపాటు అధ్యాపక సిబ్బంది కూడా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విశ్రాంత ప్రిన్సిపాల్ థియోఫిలస్ మాట్లాడుతూ 42 ఏళ్లుగా కళాశాలతో తనకు సంబంధాలున్నాయన్నారు. పూరి పాకల్లో ఉండే కళాశాలను అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి, దాతలు, ప్రభుత్వ నిధులతో పక్కా భవనాలను నిర్మించేందుకు కృషి చేశారన్నారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్.వెంకట్రామరాజు (తాడినాడ బాబు), సీడీపీసీ కార్యదర్శి డాక్టర్ పీబీ ప్రతాప్‌కుమార్, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు గొంట్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా కళాశాల అభివృద్ధికి పని చేశామని చెప్పారు. ఇక నుంచి అధ్యాపక సిబ్బందిదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, వానపల్లి బాబూరావు, ఎండీ.మదనీ, చుండూరి వెంకట్రావు, ఓలేటి వెంకటనారాయణ, బొబ్బిలి బంగారయ్య, జుంగా దాస్, పూర్వ విద్యార్థి సంఘ గౌరవాధ్యక్షుడు కొడాలి వీరభద్రరావు, కాకర్ల రాజేశ్వరి, దాసరి వెంకట సత్యనారాయణ, అమీర్, పెంకి విజయ్‌కుమార్, బెజవాడ ప్రసన్న, మోరా జ్యోతి శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో పైలాన్‌ను ప్రారంభించిన దృశ్యం

అ'పూర్వ' కలయిక.. ఆనంద హేల

కాళ్ల: సుమారు 23 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు కోపల్లె హైస్కూల్ వేదికైంది. 2001-2002లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలిశారు. స్నేహ బంధం.. ఎంత మధురమో అంటూ విద్యార్థులు ఓ చోట కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు వారి వారి పిల్లలు కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు హాజరవడంతో పాఠశాల ప్రాంగణం అంతా పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులతో నిండిపోయింది. వినోద కార్యక్రమాల్లో పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన స్నేహితులను తోటి విద్యార్థులు అభినందించారు.



కాళ్ల: హైస్కూల్‌లో సమావేశమైన 2001-2002 బ్యాచ్ విద్యార్థులు

1986-87 బ్యాచ్ విద్యార్థుల సందడి

వీరవాసరం: పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు వీరవాసరం ఎమ్మార్కే జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికైంది. హైస్కూల్ చరిత్రలోనే అత్యధిక మంది పదో తరగతి విద్యార్థులున్న 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వపు విద్యార్థులు ఒక చోట చేరారు. ప్రస్తుతం తాతలు, తండ్రులు, తల్లులుగా ఉన్న పూర్వపు విద్యార్థులు నాటి పదో తరగతి విద్యార్థులుగా మారి తరగతి గదుల విశేషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమ గురువులను సత్కరించారు. పంతం రాము, ముద్రగళ్ల శ్రీనివాస్, మల్లుల జైకృష్ణ పాల్గొన్నారు.



వీరవాసరం: పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

35 సంవత్సరాల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

పాలకోడేరు: గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986-1991 మధ్య కాలంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 35 సంవత్సరాల తర్వాత సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో సందడి చేశారు. అనంతరం వారంతా ఒకే వేదిక మీదకు వచ్చి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులైన హెచ్ఎం దయానంద రాజు, డ్రిల్ మాస్టర్ సూర్యనారాయణ రాజు, గణిత ఉపాధ్యాయుడు బాపిరాజు, సోషల్ మాస్టర్ సొంటి నాగేశ్వరరావు, హిందీ టీచర్ రామలక్ష్మి, తెలుగు టీచర్ అన్నపూర్ణ, క్రాఫ్ట్ టీచర్ బ్రహ్మానందం తదితరులను ఘనంగా సత్కరించారు.



పాలకోడేరు: గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కలిసిన 1986-1991 బ్యాచ్ విద్యార్థులు

పాఠశాలకు దాతల సహకారం

కాళ్ల: మండలంలోని 75 ఏళ్ల చరిత్ర కలిగిన కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు సహకారం అందించడంతో పలు నిర్మాణాలు పూర్తిచేశారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు పాతపాటి శ్రీనివాసరాజు, యుగంధర్ వర్మ రూ.7 లక్షల ఆర్థిక సహకారంతో వేదికను ఏర్పాటు చేయగా, దాతల సహకారంతో ఆట స్థలాలు అభివృద్ధి చేసి, ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వీటిని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ఆదివారం ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. పాతపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తాము కూడా భాగమవడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఈవీవీఎన్ నారాయణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

గ్రామీణ ప్రాంతాల్లో యువతకు నైపుణ్యం పెంపొందించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావడం శుభపరిణామమని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. పెద అమిరంలో దాతలు ముదుండి రాజేష్ కుటుంబీకులు సహకారంతో ఏర్పాటు చేసిన లక్ష్మి నరసింహారాజు డిజిటల్ లైబ్రరీ, ఆర్ఆర్ఆర్ ఎంప్లాయిమెంట్ స్కిల్ సెంటర్, అగస్త్య నెట్‌వర్క్ అకాడమీలను ఆదివారం ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జుత్తుగ నాగరాజు, కోరా రామ్మూర్తి, సర్పంచ్ డొక్కు సోమేశ్వరావు, కఠారి నరసింహారాజు, జీవీ నాగేశ్వరరావు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కోపల్లే హైస్కూల్ ఆవరణలో వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లాప్రగడ సుబ్బారావుకు ఘన నివాళి



ఎల్లాప్రగడ జయంతిని నిర్వహిస్తున్న డాక్టర్లు

భీమవరం: జన విజ్ఞాన వేదిక పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమవరం ముద్దుబిడ్డ డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. అలాగే రామ్‌లక్ష్మణ్ నగర్ పార్కులో డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ వీర్ల క్రాంతి, జేవీవీ ఉపాధ్యక్షుడు, విశ్రాంత ఉద్యోగుల కార్యదర్శి పి.సీతారామరాజు ఎల్లాప్రగడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు 1895 జనవరి 12న పేద కుటుంబంలో వెంకాయమ్మ, జగన్నాథం దంపతులకు భీమవరంలో జన్మించారన్నారు. ఎన్నో భయంకరమైన వ్యాధుల కు మందులు కనిపెట్టి యావత్తు మానవ జాతి కి మహోపకారం చేసిన వ్యక్తి డాక్టర్ ఎల్లాప్రగడ అని, ఆయనను అపర ధన్వంతరి అని కొనియాడా రు. విజర్డ్ ఆఫ్ వండర్ డ్రగ్స్‌గా ఖ్యాతి పొందారని, టెట్రా సైక్లిన్ ఫోలిక్ యాసిడ్, హెట్రాజన్, మెథోట్రెక్సెట్, ఐనోనెక్స్, ఆర్‌యామైసెల్ లాంటి ఎన్నో వి లువైన మందులు కనిపెట్టారన్నారు. ఆ మందులు ప్రాణాంతక వ్యాధులైన కలరా, టైఫాయిడ్, ప్లేగు, అతిసారం, క్షయ, బోద, క్యాన్సర్ లాంటి వ్యాధుల చికిత్సలో కల్పతరువులన్నారు. ఇటువంటి మహనీయుడు భీమవరంలో పుట్టడం మనకు గర్వకారణ మని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చుండూరు సాయిబాబు, నంద్యాల భాస్కరరాజు, పి.సీతారామరాజు, మెంటే పార్థసారథి, డాక్టర్ నాగిడి హరి శ్చంద్ర ప్రసాద్, నంద్యాల భాస్కర్ రాజు, చింతపల్లి ప్రసాదరావు, జె.రామలక్ష్మణరావు, మల్లుల శ్రీనివాస్, వెంకన్నబాబు, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



భీమవరం: డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



పాలకోడేరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

భీమవరం: డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్సీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంక్రాంతి విద్యార్థుల జీవితాల్లో కొత్త కాంతులను తీసుకురావాలన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను తెలిపేవి మన పండుగలేనని అన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ, గంగిరెద్దుల కోలాహలం, ఉత్సాహ ఆహ్లాద వాతావరణాన్ని తమ కళాశాల పండుగ వాతావరణంగా ఉందన్నారు. కార్యక్రమంలో గంగిపాముల భాస్కర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్లు అంజన్ కుమార్, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, అసిస్టెంట్ సెక్రటరీ రుద్రరాజు రామకృష్ణంరాజు (బోసు రాజు), పలు విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటల పోటీలను ప్రోత్సహించాలి

పాలకోడేరు: ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఆటలు పోటీలను ప్రోత్సహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం పాలకోడేరులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాల బాలికలకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ హాజరై మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన సంక్రాంతికి ఎంతో గొప్పదనముందన్నారు. పంట చేతికొచ్చిన సందర్భంగా రైతులు వ్యవసాయ పండుగగా సంక్రాంతిని నిర్వహిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయాలు ఉట్టి పడేలా పండుగలను నిర్వహించాలని, ప్రభుత్వాలు కోడి పందేలు, జూద క్రీడలు వంటి విష సంస్కృతిని ప్రోత్సహించడం అన్యాయమన్నారు. వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శేషపు అశ్రీయ్య, ప్రజా సంఘాల నాయకులు దున్న మరియమ్మ, వీరవల్లి వెంకటేశ్వరరావు, కంకిపాటి పుష్పనాథం, తదితరులు పాల్గొన్నారు.